


అరుణ ఆఫీసునుంచి ఇల్లు చేరుకునే సరికి ఇల్లంతా హడావుడిగా ఉంది. అలాంటి హడావుడి అర్థం ఆమెకు తెలుసు. తనను చూడ్డానికి మళ్ళీ పెళ్ళివారొస్తున్నారన్నమాట!

ఒక్కసారి ఎక్కడలేని చిరాకు కలిగిందామెకి.

ఏమిటీ నాటకం? తను తయారవడం, వాడెవడోవచ్చి చూడడం,

ఏదో క వంకపెట్టి త ప్పిం చు కు పోవడం, మళ్ళీ కొద్ది రోజులు ప్రశాంతత, మళ్ళీ ఇంకెవరో రావడం...అందువల్ల మానసికంగా తనెంత తల్లక్రిందు అవుతుందో ఎవరూ పట్టించుకోవడం లేదు.

"అసలు నాకు పెళ్ళే వద్దమ్మా! ఒంటరిగా హాయిగా ఉంటాను" అని తల్లిదండ్రులకు అనేకసార్లు చెప్పేయాలనుకుంది.

కానీ వాళ్ళను బాధపెట్టినట్లవుతుందేమోనని భయం.

రంజని వచ్చిందామె దగ్గరకు.

"అరుణా! ఇవాళ నిన్ను చూడ్డానికి వస్తున్నారు. త్వరగా రడీ అవ్వమ్మా!"

అరుణ తల్లివంక చూసింది.

రంజని ఆమెను అర్థం చేసుకున్నట్లు చిరునవ్వు నవ్వింది.

"ఈ సంబంధమయినా కుదిరిపోతే బాగుండునని దేముడికి మొక్కుకుంటున్నాను."

అరుణ అక్కడనుంచి బాత్ రూమ్ వేపు నడిచింది.

తప్పదు__

వాళ్ళకోసం తనూ, తనకోసం వాళ్ళూ!

మొట్టమొదట రెండు పెళ్ళి చూపుల్లోనే తనకు పెళ్ళి అనే ఏర్పాటు మీదే విరక్తి కలిగింది.

డబ్బుపెట్టి భార్యను కొనుక్కోవడం, ఆ తరువాత భర్తనే సర్వస్వంగా భావిస్తూ, 'తన' అనే పదాన్ని మర్చిపోయి జీవితం గడిపేయడం....

బయట ఆటో ఆగిన చప్పుడయింది.

"అమ్మా! వాళ్ళు వచ్చేశారు." చెల్లాయ్ అరుస్తూ లోపలికొచ్చింది.

తండ్రి వారికి ఎదురెళ్ళి లోపలకు ఆహ్వానించాడు.

హాల్లో వాళ్ళ మాటలు అస్పష్టంగా వినబడుతూనే ఉన్నాయ్.

"అరుణా! పద-హాల్లో కెళ్దువుగాని." రంజని అరుణ దగ్గరకొస్తూ అంది.

అరుణ హాల్లోకివెళ్ళి వాళ్ళకెదురుగా ఉన్న కుర్చీలో కూర్చుంది.

ఎదురుగ్గా అతను ఉన్నాడు.

అతని పక్కన అతని తల్లీ, చెల్లెలూ.

"ఏ ఆఫీసులో వర్క్ చేస్తున్నారు మీరు?" అడిగాడతను.

ఇవన్నీ కూడా ఫార్మాలిటీ ప్రశ్నలే!

"పి. ఐ. బి.లో."

"నేను ఎల్లయ్‌సీలో వర్క్ చేస్తున్నాను...."

"ఐసీ!"

"బియెస్సీలో ఏ సబ్జెక్ట్ మీది?"

"ఫిజిక్స్!"

ఆ తరువాత వాళ్ళమాటలన్నీ తండ్రితోనే.

తను లోపలకు వచ్చేసింది. వాళ్ళ మాటలు వినబడుతూనే ఉన్నాయ్.

కట్నం గురించి అతని తల్లి మాట్లాడింది.

"పాతికవేలు కాష్, మిగతా వన్నీ మామూలే!"

"అమ్మాయి ఉద్యోగంచేస్తూంది కదా! అంత కట్నం అడగడం మీకు భావ్యంకాదు!"

"ఉద్యోగంచేస్తున్న అమ్మాయి కావాలని మా వాడు పట్టు పట్టబట్టే పాతికవేలు చెప్పాను. లేకపోతే యాభై వేలు ఇస్తామని వస్తు న్నారు." నవ్వు. ఎలా నవ్వడం సాధ్యమవుతోందామెకి?

వాళ్ళు వెళ్ళిపోయారు.

బేరం కుదర లేదు.

తండ్రి ఖిన్నుడయి కూర్చు న్నాడు. తల్లి, దేవుడిగదిలో మన శ్శాంతి కోసం ప్రార్థన చేస్తోంది.

చెల్లాయ్ తన క్లాసు పుస్తకాలు తీసి చదువుకుంటోంది. తమ్ముడు ఎక్కడికో వెళ్ళిపోయాడు.

అరుణకు పట్టరాని కోపంగా ఉంది.

తనకు చదువుంది. అనాకారి కాదు. ఉద్యోగం ఉంది. అయినా తనకు పెళ్ళి కావటంలేదు. ఇంక ఇవేమీ లేనీ ఆడపిల్లల సంగ తేమిటి?

ఊహు- ఇదిలా కొనసాగ డానికి వీల్లే దు.

తల్లితో చెప్పేయాలి. ఇంక ఈ హ్యూమిలేషన్ భరించడం తనవల్ల కాదు. ఇంకోసారి పెళ్ళి చూపులు జరగడానికి వీల్లేదు.

ఆ రాత్రి అరుణ మాటలు విని మరింత కృంగిపోయింది రంజని. మర్నాడు ఆఫీస్‌కెళ్ళేసరికి శ్రీకాంత్ ఆమెకోసం ఎదురు చూస్తూ కూర్చు న్నాడు.

"హాయ్!" చిరునవ్వుతో పలక రించిందతనిని.

"ఎలా వున్నారు?" అడిగా డతను ఆనందంగా.

"జస్ట్ యాజ్ అయ్ వజ్.....మీ కొత్త ఉద్యోగం ఎలా వుంది?"

"చాలా ప్లెజెంట్‌గా ఉంది. ఆఫీస్ అవర్స్ ఆరుగంటలే! మధ్యలో ఓ గంట లంచ్! కానీ ఆ అయిదు గంటలూ ఊపిరాడ నంత పని. టైమెలా గడిచి పోతుందో మనకే తెలీదు."

"గవర్నమెంట్ జాబ్స్‌కీ, ప్రైయివేట్ కంపెనీ జాబ్స్‌కీ అదే తేడా!" నవ్వుతూ అందామె.

"యా! నౌ అయ్ ఎంజాయ్ మైజాబ్. కానీ ఒకే ఒక్క అసంతృప్తి!"

"ఏమిటది?" ఆశ్చర్యంగా చూస్తూ అందామె.

"అయ్ మిస్ యూ ఎలాట్. మీతో వర్క్ చేయడం నిజంగా ఒక అదృష్టం!" అరుణ హృదయం ఆనందంతో పొంగిపోయింది.

"నాల్రోజులు అలాగే అనిపిస్తుంది లెండి!"

"ఊహూ-కాదండీ! జీవితాంతం గుర్తుండిపోయే లోటు ఇది!"

ఆమె డెలికసీ ఫీలయింది.

అతని మాటలు సూటిగా గుండెల్ని స్పర్శిస్తున్నాయి.

"మీరు నవ్వుతారేమో! ఈ నాలుగు రోజుల్లోనే ఎంత అప్సెట్ అయిపోయానో మీకు తెలీదు. మిమ్మల్ని చూడాలనీ, మీతో అయిదు నిముషాలయినా మాట్లాడాలనీ. రెండు రోజుల్నుంచీ ఎంత అశాంతి అనుకున్నారు. అందుకే తొమ్మిదన్నరకల్లా ఇక్కడికొచ్చి కూర్చున్నాను మీకోసం."

"మరి మీకు ఆఫీస్ లేదూ?"

"పదిన్నరకు! ఆటోలో వెళ్తే గాని టైమ్‌కి చేరుకోలేను. వస్తానండీ! సీయూ ఎగైన్...."

అతను వెళ్ళిపోయాడు.

అరుణ ఇంకా అతని మాటల మత్తులోనుంచి తేరుకోలేదు. 'ఎందుకు ఇద్దరి మధ్యా ఇంతటి ఎటాచ్‌మెంట్ ఏర్పడింది? ఇద్దరూ కలిపి ఆరునెలలు పని చేశారు. ఈ కొద్దికాలంలో ఎందుకింత దగ్గరయారో తనకూ అంతు పట్టటం లేదు.

తను ఆ ఆఫీసులో అయిదేళ్ళ నుంచీ పని చేస్తోంది. ఎంతోమంది మగాళ్ళతో పరిచయముంది. కానీ ఎప్పుడూ ఆ పరిచయం అంతకు మించి పెరగలేదు. ఎవ్వరితోనూ చనువు పెంచుకోలేదు. ఎంతోమంది తనను ఎన్నోవిధాల ఆకర్షించాలని ప్రయత్నించి, తన విముఖత్వం వల్ల దూరంగా ఉండిపోయారు. శ్రీకాంత్‌తో అలా క్కాదు. ఇద్దరిలో ఎవ్వరూ ఎవ్వరినీ ఆకర్షించాలని గానీ, పరిచయం పెంచుకోవాలనీ గానీ అనుకోలేదు, ప్రయత్నించనూ లేదు.

చాలా సాధారణంగా, నేచురల్‌గా దగ్గరయిపోయారు. ఆశ్చర్యం ఏమిటంటే మానసికంగా ఇంత సన్నిహితత్వం ఏర్పడినట్లు ఇద్దరికీ తెలీదు.

అతను మరో ఉద్యోగానికి

సెలక్టయ్యాక, మరో వారం రోజుల్లో ఈ ఉద్యోగం వదలి వెళ్ళిపోతున్నా డన్నప్పుడు తను మొట్టమొదటిసారిగా తెలుసుకుంది- అతని సాన్నిధ్యం ఎంత గాఢంగా కోరుకుంటోందో తను! అలా వివాహితుడయిన వ్యక్తి మీద ఎందుకు అభిమానం అల్లుకుందో, ఇప్పుడు ఆ బంధం నుంచి ఎలా బయట పడాలో—బొత్తిగా అర్థం కావడం లేదు.

మరికొద్ది రోజులు గడచి పోయాయ్.

రెండు మూడు రోజులకోసారి శ్రీకాంత్ తనకోసం ఆఫీస్‌కొచ్చి కాసేపు మాట్లాడి వెళ్తూనే ఉన్నాడు.

అతను కనబడుతూంటే తను మిగతా విషయాలన్నీ చాలావరకూ మరచిపోతూంటుంది.

ఆరోజు ఆదివారం.

తమ దూరపు బంధువొకాయన వచ్చాడు ఊరినుంచి. ఆయన మాటల సారాంశం ఏమిటంటే భార్య చనిపోయిన ఒకతను రెండో పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నాడట. అందుకని తనను అతనికిచ్చేందుకు అంగీకరిస్తారేమోనని అడగడాని కొచ్చాడట.

అతని మాటలకు తన తండ్రికి కోపం వచ్చింది.

"అలా అడగడానికి నీకు నోరెలా వచ్చింది? మంచి సంబంధం, మా తాహతుకి తగ్గ సంబంధం

---

# విజయ

# చందా వివరాలు

| | |
|---|---|
| సంవత్సర చందా | 42 రూ॥ |
| అర్థసంవత్సర చందా | 21 రూ॥ |
| విడి ప్రతి | 3-50 రూ॥ |

కోసం చూస్తున్నాను గానీ, గతిలేక కాదు. ఇంకోసారిలాంటి సంబంధాలు తేకు. వెళ్ళు!"

రంజని అతనికి అడ్డు పడింది.

"అలా మాట్లాడతా రెందుకు? ఆ సంబంధం సరిగ్గా చూడనీండి. అతను చిన్న వయసులోనే ఉండి, మిగతా పరిస్థితులన్నీ బాగుంటే రెండో సంబంధ మయితే మాత్ర మేం?" కన్నీళ్ళతో అందామె.

"అవునమ్మా! రెండో సంబంధ మయినంత మాత్రాన కాని పని అనీ, పరువు తక్కువనీ ఎందు కనుకుంటారో నాకు తెలీదు. చూస్తూ చూస్తూ అమ్మాయి వయసిలా పెరిగిపోతూంటే తరువాత ఇవి కూడా దొరకడం కష్టమే అవుతుంది."

అరుణకు నవ్వు వచ్చింది.

ఆఖరికి తన గతి ఇలా అయిందన్నమాట! రెండో పెళ్ళి వాడి కిచ్చి చేయడానికి కూడా కష్టమయి పోతుందిట.

రెండోపెళ్ళి వాడంటే తనకేం చిన్నచూపు లేదు. కానీ మగాడి కయితేనే రెండో పెళ్ళికి పిల్ల దొరుకుతుంది. అదే భర్త చని పోయిన ఆడపిల్ల జీవితాంతం అలా అఘోరించాల్సిందే!

అక్కడ ఆప్షన్ లేదు.

అశాంతిగా ఉందామెకి.

తండ్రి మౌనం వహించాడు.

అంటే రాజీ పడ్డాడన్నమాట!

మరి తను?

తనూ రాజీ పడుతుందా?

ఊహూ- వీల్లేదు. ఎందుకో మనసొప్పుకోవడం లేదు.

ఏదో నవల తీసుకుని చదువు కుంటూ పడుకుందామె. ఎప్పుడు నిద్రపట్టిందో తెలీదు. మెలకువ వచ్చేసరికి సాయంత్రం అయిదయి పోయింది.

రాత్రి భోజనాలయాక తల్లీ తండ్రీ ఇద్దరూ తనదగ్గర కూర్చుని తనకు నచ్చచెప్పడం ప్రారంభించారు.

"మాకూ ఇష్టంలేదు. కానీ.... పరిస్థితులు చూస్తే ఇలా వున్నాయ్. ఇప్పుడు అతను బాంక్‌లో ఆఫీస రట. ఇద్దరే పిల్లలు ఉన్నారు. వయసుకూడా తక్కువే! ముప్ఫయ్ అయిదు. నువ్వు సుఖపడతావనే అనిపించింది...."

అరుణ మాట్లాడలేదు. ఎటూ నిర్ణయించుకోలేక పోతోంది.

"ఇతను కూడా కట్నాలూ లాంఛనాలూ అని అడగడం లేదు. చాలా తక్కువ! పెళ్ళి ఖర్చుల కోసం పదివేలు ఇమ్మంటున్నాడు. అంతే!"

ఒక్కసారిగా శరీరమంతా అగ్నిలో దహించుకుపోతున్నట్లని పించింది అరుణకి.

"రెండో పెళ్ళికికూడా పదివేలు ఇవ్వాలా? నేను చేసుకోను!"

వాళ్ళిద్దరూ ఆశ్చర్యపోయారు.

"పోనీలే అమ్మా! రోజులట్లా ఉన్నాయ్. మనం పంతం పడితే ఎలా?"

"అమ్మా! నేను చేసుకోను అని చెపుతున్నాను-అంతే!"

ఆ రాత్రంతా ఏవేవో ఆలోచనలతో సతమతమయిపోయిందామె.

ఉదయం ఆఫీసుకి చేరుకుని ఆ రోజుకి శెలవు మంజూరు చేయించుకుని అక్కడినుంచి శ్రీకాంత్ ఆఫీసుకి చేరుకుంది.

ఆమెను చూసి శ్రీకాంత్ ఆశ్చర్యపోయాడు.

"ఏమిటిలా వచ్చారు?"

"మీతో ఓ ముఖ్యమయిన విషయం మాట్లాడాలి!"

"ఏమిటది?"

"ఇక్కడ కాదు. శెలవుపెట్టి రండి! ఎక్కడయినా కూర్చుని మాట్లాడుకుందాం."

అతను మరొక్క మాటకూడా మాట్లాడకుండా లోపలికి వెళ్ళి పది నిమిషాల తర్వాత తిరిగివచ్చాడు.

"పదండి!" అన్నాడు బయటకు నడుస్తూ.

ఇద్దరూ గార్డెన్‌లో కొచ్చి కూర్చున్నారు.

"ఏమిటి విషయం?" ఆత్రుతగా అడిగాడతను.

"మీరు నన్ను పెళ్ళిచేసుకుంటారా?" అతని కళ్ళల్లోకి సూటిగా చూస్తూ అడిగిందామె.

అతను తృళ్ళిపడ్డాడు. ఆమెకేం జవాబివ్వాలో తెలీటం లేదు.

"జవాబు చెప్పలేరా?" నవ్వుతూ అందామె.

"ఇంత త్వరగా జవాబు చెప్పగల ప్రశ్నేనా మీది?"

"చూడండి! మనిద్దరికి ఒకరంటే ఒకరికి ప్రేమానురాగాలు ఉన్నాయ్. ఒకరినొకరు అర్థంచేసుకున్నాం. మీకు అదిష్టం కాకపోతే తప్పక వివాహం చేసుకుని ఉండేవాళ్ళం. కట్నాలు ఇచ్చి ముక్కు మొఖం తెలీని వ్యక్తిని కొనుక్కోవడం గాంబ్లింగ్ లాంటిది. అతనితో జీవితం ఎలా గడుస్తుందో ఎవరూ ఊహించలేరు. అసలు కట్నం ఇచ్చి అతన్ని కొనుక్కోవడం అనేది ఎంతో నీచమయిన పనిగా అనిపిస్తుంది నాకు.

"అలాంటి పెళ్ళి చేసుకుని జీవితం గడిపే బదులు, నేను ప్రేమిం

చిన వ్యక్తికి రెండో భార్యగా ఉండడంలో తప్పేమీ కనిపించటంలేదు. కేవలం కట్నంకోసమే పెళ్ళి చేసుకుంటున్న వ్యక్తి కంటె, నన్నో వ్యక్తిగా గౌరవించి లాలించే వ్యక్తికి రెండో భార్య అవడమే నా మనసుకి మంచిదనిపిస్తోంది. నన్ను చేసుకోవడంవల్ల మీ కెలాంటి సమస్యలూ రావని హామీ యిస్తున్నాను. నేను మా ఇంట్లో నే ఉంటాను. మీరు వీలయినప్పుడల్లా వచ్చి నాతో కాసేపు గడిపి వెళ్తే అంతే చాలు నాకు. ఇరవై నాలుగ్గంటలూ నాతోనే గడపాలనే మనస్తత్వం కాదు నాది. ఇక ఆర్థికంగా కూడా మీ మీదపడే బాధ్యతేమీ ఉండదు. నా కొచ్చే జీతంతో నన్నూ, నాకు కలిగే పిల్లలనూ నేను పోషించుకోగలను. దయచేసి కాదనకండి...." దీనంగా అందామె.

శ్రీకాంత్ ఆమె మాటలకు చలించిపోయాడు.

సాయింత్రం వరకూ ఆ విషయము గురించే ఆలోచిస్తూండిపోయారిద్దరూ.

* * *

మరో వారం రోజుల తర్వాత శ్రీకాంత్‌తో పాటు తనింటిముందు రిక్షా దిగింది అరుణ.

"నేనూ, ఈయనా పెళ్ళి చేసుకున్నామమ్మా! నేను రెండో సంబంధం చేసుకోడంలో తప్పు లేదని మీరూ అన్నారుగా! అయితే ఈయనకు భార్యా పిల్లలుకూడా ఉన్నారు. అయినా ఈ రెండింటికీ భేదం ఏముందని? భార్యలేని అతనిని చేసుకున్నా, భార్య ఉన్న ఇతనిని చేసుకున్నా నా మటుకి నాకు ఏమీ తేడా ఉండదు కదా?"

ఆమె మాటలు విని తెల్లబోయారామె తల్లిదండ్రులు.

"ఈయనంటే నా కిష్టం! తనూ నన్ను లైక్ చేస్తారు. మా సంసారం సాఫీగా సాగుతుందనే నమ్మకం మా కిద్దరికీ ఉంది. మీరూ అంగీకరిస్తే నేను ఇక్కడే ఉంటాను. వీలయినప్పుడల్లా ఆయన వచ్చి వెళ్తూంటారు. వీల్లేదంటే మరో ఇల్లు చూచుకుంటాను."

అసలా మాటలు మాట్లాడుతున్నది అరుణేనా అని అనుమానం కలుగుతోంది వారికి. అరుణచేసింది మంచిపని కాదని, ఇద్దరికీ అనిపిస్తోంది. కానీ ఆమె వాదనని ఖండించేంతటి మంచి మార్గం కూడా మరోటి కనిపించడంలేదు.

రంజని లేచి అరుణను దగ్గరకు తీసుకుంది-ఆవేదన నిండిన హృదయంతో. ✱